




# మనం

మెదక్ సంగారెడ్డి సిద్దిపేట

శుక్రవారం | 17 | నవంబర్ | 2023 | పేజీలు : 8


# ప్రచారంలో గులాబీ జోరు

## -గడప గడపకు ప్రచారం

## -లక్షన్నర మెజార్టీయే లక్ష్యం

సిద్దిపేట, నవంబర్ 16, మనం న్యూస్ ప్రతినిధిః ఎన్నికల ప్రచారంలో బిఆర్ ఎస్ దూసుకుపోతోంది. బిఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్న సిద్దిపేటలో ఏడవ సారి బరిలో ఉన్న అభ్యర్థి హరీష్‌రావుకు రికార్డు మెజార్టీని సాధించడమే లక్ష్యంగా ప్రచారం సాగుతోంది. గత ఎన్నికల్లోని మెజార్టీని దాటి లక్షన్నర మెజార్టీయే లక్ష్యంగా సాగుతున్న ప్రచారానికి మంచి మద్దతు లభిస్తోంది. సిద్దిపేట పట్టణంలోని 13, 14, 23, 24 వార్డుల్లో నిర్వహించిన ప్రచారంలో మన్సిపల్ ఛైర్‌పర్సన్ మంజుల రాజనర్సు, పట్టణ అధ్యక్షులు కొండం సంపత్‌రెడ్డి,సీనియర్ నాయకులు



మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్తూ సంక్షేమ పథకాలను వివరిస్తూ తొమ్మిదేళ్లలో సిద్దిపేటలో చేసిన అభివృద్ధిని పుస్తక రూపంలో ముద్రించగా వాటిని ఇంటింటికి పంచుతూ ఒక్క ఓటు పక్కకు పోకుండా గంపగుత్తగా హరీష్‌రావుకే వేయాలంటూ అభ్యర్థిస్తున్నారు. టీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కౌన్సిలర్లు, యువజన సంఘాలు, మహిళా నేతలు పెద్ద సంఖ్యలో ప్రచారంలో పాల్గొని హరీష్‌రావును గెలిపించాలంటూ కోరుతున్నారు మిగతా 8లో..

# కలలు కలలుగానే మిగిలాయి

స్వరాష్ట్ర ఉద్యమ కాంక్ష నీరుగారింది

ఇచ్చిన హామీలు నెరవేర్చని బిఆర్ఎస్

దుబ్బాక ఆత్మగౌరవాన్ని హరీష్‌రావుకు తాకట్టుపెట్టిన ప్రభాకర్‌రెడ్డి

కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి




# పేదల పక్షాన నిలిచే పార్టీ బీజేపి

బిఆర్ఎస్‌కు మద్యంపై ఉన్న శ్రద్ధ ప్రజలపై లేదు

బిసి అభ్యర్థిని ముఖ్యమంత్రి చేస్తామని చెప్పిన ఏకైక పార్టీ బీజేపి

స్వరాష్ట్రంలోనూ నిరుద్యోగులకు నిరాశే

బీజేపి అధికారంలోకి వస్తే జాబ్ క్యాలెండర్ విడుదల

దుబ్బాక బీజేపి అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు

దుబ్బాక/దుబ్బాక టౌన్, నవంబర్ 16, మనం న్యూస్ః గరీబోళ్ల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ అని, గిరిజన బిడ్డను ఈ దేశానికి రాష్ట్రపతిగా నియమించి పేదల పక్షాన నిలిచిందని దుబ్బాక బీజేపి ఎమ్మెల్యే అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. గురువారం రోజున రాయపోల్ మండలం మంతూరు, చిన్నమాసాన్‌పల్లి, ఎస్.జె. ఆరెపల్లి, నార్సింగి మండలం నర్సంపల్లి, పెద్ద తండా, వల్లభాపూర్, వల్లూరు, భీమ్‌రావుపల్లి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం కోసం



భారతీయ జనతా పార్టీ కృషి చేస్తుందని, ఆదివాసులకు, గిరిజన బిడ్డలకు సాగు చేసుకునే తమ భూమిపై హక్కు కోసం పోరాడితారే తప్ప మరొక్క విషయంలో కాదన్నారు. జల్ జంగల్ జమీన్ ఇది ఆదివాసీల నినాదమన్నారు. పోడు భూములకు పట్టాల కోసం గతంలో అసెంబ్లీలో ప్రస్తావించడం జరిగిందన్నారు. మంతూరు గ్రామ పంచాయతీకి ఎన్ఆర్ఈజిఎస్ పథకం మిగతా 2లో..

# పేదల పక్షాన నిలిచే పార్టీ బీజేపి



మొదటి పేజీ తరువాయి..

కింద సిసి రోడ్డు కోసం రూ.15 లక్షలు మంజూరు చేస్తే ఇంత వరకు రోడ్డు వేయలేదని, దీనికి అదనంగా కో ఆప్షన్ మెంబర్ రూ.5 లక్షలు కలిపారని, రూ.20 లక్షలు మంజూరై ఆరు నెలలవుతున్నా సర్పంచ్, కో ఆప్షన్ మెంబర్ల మధ్య సమన్వయం కొరవడి రోడ్డు వేయకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల్లో మాత్రమే రాజకీయాలు చేయాలి తప్ప అభివృద్ధి విషయంలో ప్రజలను ఇబ్బంది పెట్టవద్దన్నారు. బిఆర్ఎస్ పార్టీకి గరీబోళ్ల సంక్షేమమంటే పట్టదని, మద్యంపై ఉన్న శ్రద్ధ పేదల సంక్షేమంపై లేదన్నారు. ప్రభుత్వం దళితబంధు పేరుతో దళితులను మోసం చేసిందని, గ్రామాల్లోని ఏ ఒక్క దళితునికి కూడా దళితబంధు ఇవ్వలేదన్నారు. ఎస్.జె ఆరెపల్లి గ్రామాన్ని గజ్వేల్ నియోజకవర్గంలో కలపాలని ఎన్నిసార్లు విన్నవించినా కూడా ఈ ముఖ్యమంత్రి పట్టించుకోలేదన్నారు. బిసిబంధు పేరుతో ఈ ప్రభుత్వం బిసిలను మోసం చేసిందని, బిసిబంధు దరఖాస్తు కోసమే వేయి రూపాయల వరకు ఖర్చయిందని, కానీ కేవలం గ్రామాల్లో టీఆర్ఎస్ పార్టీ నాయకులు ఒకరిద్దరికి తప్ప ఎవరికీ బిసిబంధు ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో బీజేపి అధికారంలోకి వస్తే బిసి అభ్యర్థే ముఖ్యమంత్రి అవుతాడని ధైర్యంగా చెప్పిన పార్టీ బీజేపి పార్టీ అన్నారు. ప్రజా సమస్యలు గాలికి వదిలేసి కాంట్రాక్ట్ కమీషన్‌ల కోసమే బిఆర్ఎస్ ప్రభుత్వం పని చేసిందన్నారు. చదువుకున్న విద్యార్థులకు ఈ ప్రభుత్వం ఉద్యోగావకాశాలు కల్పించలేదని, నేడు ఎంతో మంది యువత ఉద్యోగాలు లేక రోడ్డుపై తిరుగుతున్నారన్నారు. ప్రత్యేక రాష్ట్రం సిద్ధిస్తే ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగుతాయని మాయమాటలు చెప్పిన ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. పదేళ్ల అధికారంలో ఉండి ప్రజా సంక్షేమాన్ని ఈ ప్రభుత్వం విస్మరించిందని, మరోమారు అవకాశం వస్తే రాష్ట్రం అప్పులపాలవడమే కాక అన్ని రంగాల్లో వెనుకబడుతుందన్నారు. ఈ రాష్ట్రంలో కల్వకుంట్ల కుటుంబం అభివృద్ధి చెందింది తప్ప పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే అది భారతీయ జనతా పార్టీతోనే సాధ్యమని, ఈ ఎన్నికల్లో కమలం గుర్తుపై ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. నవంబర్ 30న జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఈవియంలో మూడవ నెంబర్‌పై ఉన్న కమలం గుర్తుకు ఓటేసి ప్రతి ఒక్కరు బీజేపిని గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం రాయపోల్ మండలం ఆరెపల్లి, మంతూరు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు రఘునందన్‌రావు సమక్షంలో బీజేపి పార్టీలో చేరారు.



-దౌల్తాబాద్‌లో... దుబ్బాక గడ్డపై బీజేపి గెలుపు ఖాయమని బీజేపి రాష్ట్ర మహిళా మోర్చ కార్యదర్శి సుధారెడ్డి అన్నారు. గురువారం దౌల్తాబాద్ మండల పరిధిలోని శేరిపల్లి బందారం, నర్సంపేట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు కేటాయించినా బిఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేసి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, వారి మాయమాటలు ప్రజలు నమ్మవద్దన్నారు. ఉప ఎన్నికల్లో రఘునందన్‌రావు గెలిచిన మూడేళ్లలోనే దుబ్బాక ప్రజల కోసం అసెంబ్లీల్లో కొట్లాడి పనులు చేయించారని పేర్కొన్నారు. గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల తరహాల్లో దుబ్బాకకు నిధులు రావాలంటే ప్రజలు మరోసారి తమ అమూల్యమైన ఓటును కమలం పువ్వు గుర్తుకు వేసి రఘునందన్‌రావును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, శ్రీశైలం, మధు, కరుణాకర్, భాను, వేణు, స్వామి, నరేష్, అనిల్, హరీష్, మహేందర్, మహేష్, రజనీకాంత్, శ్రీకాంత్, నాగరాజు, వినోద్, ప్రవీణ్, అరవింద్, కర్ణాకర్, భాను, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.







## పూర్తయిన రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియ

### జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జె పాటిల్




సిద్దిపేట, నవంబర్ 16, మనం న్యూస్ ప్రతినిధిః శాసనసభ ఎన్నికల పోలింగ్ అధికారుల రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియను కలెక్టర్ కార్యాలయంలో ఎలక్షన్ అబ్జర్వర్ల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. జిల్లాలోని 5061 మంది ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్, అదర్ ప్రిసైడింగ్ ఆఫీసర్ల సెకండ్ ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల అబ్జర్వర్ల సమక్షంలో నిర్వహించి నియోజకవర్గాలను కేటాయించారు. ఈ ప్రక్రియలో హుస్నాబాద్, సిద్దిపేట నియోజకవర్గాల జనరల్ అబ్జర్వర్ జయశ్రీ ఎస్‌బోజ్, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాల జనరల్ అబ్జర్వర్ మన్మోహన్ ప్రసాద్, సిద్దిపేట జిల్లా పోలీస్ అబ్జర్వర్ సోనమ్ టెన్సింగ్ బూటియా, దుబ్బాక , గజ్వేల్ నియోజకవర్గాల ఎక్స్‌పెండీచర్ అబ్జర్వర్ వెంకటేష్ బాబు పాల్గొన్నారు.

# కలలు కలలుగానే మిగిలాయి

దుబ్బాక/దుబ్బాక టౌన్, నవంబర్ 16, మనం న్యూస్ః కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో నీళ్లు, నిధులు, నియామకాలు దక్కుతాయని కలలుగన్న ప్రజల కలలు బిఆర్ఎస్ పాలనలో కలలుగానే మిగిలిపోయాయని దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం రోజున ఆయన దుబ్బాక మండలం హబ్సిపూర్, పద్మనాభునిపల్లి, హసన్‌మీరాపూర్, తిమ్మాపూర్, పెద్దగుండవెల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఉద్యమ కాంక్ష పూర్తిగా నీరుగారిపోయిందని, సాధించుకున్న తెలంగాణలో అనుకున్న లక్ష్యాలేవీ నెరవేరలేవు కానీ కల్వకుంట్ల కుటుంబం మాత్ర బాగుపడిందని ఎద్దేవా చేశారు. పదేళ్లలో ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ వేసిన దాఖలాలు లేవని, కేజీ టు పిజి విద్య అందిస్తాని చెప్పి నేటికీ ఆ హామీని హామీగానే మిగిల్చారన్నారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని, ఉద్యోగాలు లేక నిరుద్యోగ యువత మద్యానికి బానిసై జీవితాన్ని ఛిద్రం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ వైపు రాష్ట్ర సంక్షేమం అని చెప్తూ రాష్ట్రంలో మద్యం ద్వారా వచ్చే ఆదాయం ద్వారా ప్రభుత్వాన్ని నడిపిస్తూ రాష్ట్రాన్ని తాగుబోతుల రాజ్యంగా మార్చారన్నారు. సిద్దిపేటకు చెందిన మంత్రి హరీష్‌రావు సిద్దిపేట,





దుబ్బాక ఒక కన్ను చెప్తాడు కానీ దుబ్బాకను పట్టించుకున్న పాపాన పోలేదని, కానీ ఎంపి ప్రభాకర్‌రెడ్డి దుబ్బాక ప్రజల ఆత్మగౌరవాన్ని హరీష్‌రావు వద్ద తాకట్టుపెట్టాడని మండిపడ్డారు. గతంలో ముత్యంరెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప ఇంత వరకు నియోజకవర్గంలో జరిగిన కొత్త అభివృద్ధి ఏమీ లేదన్నారు. మూడేళ్లు అధికారంలో ఉన్న రఘునందన్‌రావు సైతం చేసిందేమీ లేన్నారు. కాంగ్రెస్ వస్తే ఉచిత కరెంటు ఉండదని కేసీఆర్ అబద్ధాలు చెప్తున్నారని, ఉచిత కరెంటు ప్రవేశపెట్టిందే కాంగ్రెస్ పార్టీ అన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. బిఆర్ఎస్ నాయకులు కమీషన్‌ల కోసం అమ్ముడుపోయారని, కానీ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏనాడూ కమీషన్‌లకు ఆశపడలేదన్నారు. ఇంతిటి అవినీతి బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఇంటికి సాగనంపి తమ విలువైన ఓటును చేతి గుర్తుకు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ తోనే నియోజకవర్గం, రాష్ట్రం అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రవి, ఉపాధ్యక్షులు కద్దూరి నరేందర్‌రెడ్డి, ఆయా గ్రామాల కాంగ్రెస్ బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఏ పదవి లేకున్నా సేవ చేస్తా



**-నిఖార్సైన రాజకీయం నాది**

**-నమ్మి గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా**

**-ఇందిరమ్మ ఇల్లులేని గ్రామాన్ని చూపండి**

**-కాంగ్రెస్ మెదక్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌రావు**

నిజాంపేట్, నవంబర్ 16, మనం న్యూస్: గతంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి మళ్లీ ఎన్నికలు వచ్చేసరికి కొత్త పంచాంగంతో మాయమాటలు చెప్తున్నారని, ప్రజలు నమ్మి మోసపోవద్దని మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. మండల పరిధిలోని రాంపూర్, నందగోకుల్, నస్కల్, నగరం, చల్మెడ గ్రామాల్లో గురువారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా రాంపూర్ గ్రామ సర్పంచ్ దంపతులు రజిత లక్ష్మణ్ గౌడ్, బిఆర్ఎస్ కార్యకర్తలు 40 మంది కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. అలాగే నస్కల్ గ్రామంలో 28 మంది మైనార్టీ సోదరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రోహిత్‌రావు మాట్లాడుతూ పదేళ్ల పాలనలో బిఆర్ఎస్ చేసిందేమీ లేదని, ఇప్పుడేం చేస్తారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆత్మీయ సభలో తనను దిష్టిబొమ్మతో పోల్చారని, అలాగే మెదక్ ప్రజలకు దుష్ట శక్తులన ఉండి దిష్టిబొమ్మనై కాపాడుకుంటానన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు సంక్షేమ పథకాలను ప్రజలకు క్లుప్తంగా వివరించారు. నన్ను మీ బిడ్డలా ఆదరించి ఒక్కసారి అవకాశం ఇచ్చి చేతి గుర్తుపై ఓటేయాలని కోరారు. ఆపదలో కేక వేస్తే మీ ముందు వాలుతానన్నారు. ముఖ్యంగా డబుల్ బెడ్‌రూమ్ లేని గ్రామాన్ని నేను చూపుతా, ఇందిరమ్మ ఇల్లు లేని గ్రామాన్ని వారు చూపాలని, ప్రచారాన్ని కూడా డబుల్ బెడ్‌రూమ్ గ్రామాల్లోనే జరుపుకోవాలని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పంజా మహేందర్, నసీరుద్దీన్, మారుతి, అందె స్వామి, భూపతి రెడ్డి, వెంకటేష్ గౌడ్, కుమార్, నరేందర్, జ్వాల శ్రీకాంత్, లక్ష్మాగౌడ్, మహేష్, పంజా బాబు, సులేమాన్, గుమ్ముల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ సిద్ధాంతాలకు ఆకర్షితులై పలువురి చేరిక



చేర్యాల, నవంబర్ 16, మనం న్యూస్: భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నిర్వహిస్తున్న పోరాటాలకు, సిద్ధాంతాలకు ఆకర్షితులై సిపిఐలో పలువురు చేరినట్లు సిపిఐ జిల్లా జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ తెలిపారు. గురువారం చేర్యాల మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన ముచ్చాల రామకృష్ణతోపాటు పలువురు సిపిఐలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుండి దేశ స్వాతంత్ర్య ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో సిపిఐ కీలక పాత్ర పోషించిందన్నారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలను ఉద్య మాల వైపు నడిపించి ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్న పార్టీ సిపిఐ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, కుడిక్యాల బాల్‌మోహన్, వలబోజు నరసింహాచారి, బండారి సిద్ధయ్య, పొన్నబోయిన మమత, నంగి కనకయ్య, తీగుల్ల కనకయ్య ఉన్నారు.

## నేడు జగదేవ్‌పూర్‌కు హరీష్‌రావు

**రోడ్‌షోను విజయవంతం చేయాలి**

**సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు రాచర్ల నరేష్**



జగదేవ్‌పూర్, నవంబర్ 16, మనం న్యూస్: నేడు జగదేవ్‌పూర్ మండల కేంద్రానికి సిద్దిపేట బిఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి హరీష్‌రావు రానున్నారని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు రాచర్ల నరేష్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ నేడు మండల కేంద్రంలో గజ్వేల్ బిఆర్ఎస్ అభ్యర్థి, సీఎం కేసీఆర్‌కు మద్దతుగా నిర్వహించనున్న మంత్రి హరీష్‌రావు రోడ్ షోకు మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఎఫ్‌డిసి ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డిలు సైతం హాజరవుతారని తెలిపారు. అణగారిన వర్గాల ఆశాజ్యోతి అయిన ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వాన్ని బలపరచడం కోసం రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు.

## అభివృద్ధి చేసే నాయకుడు కేసీఆర్‌నే గెలిపించండి

**బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బెండె మధు**



గజ్వేల్, నవంబర్ 16, మనం న్యూస్: గజ్వేల్ నియోజకవర్గాన్ని ఎవరూ ఊహించని రీతిలో అభివృద్ధి చేసిన సీఎం కేసీఆర్‌నే మరోసారి గజ్వేల్ ఎమ్మెల్యేగా మూడవసారి భారీ మెజార్టీతో గెలిపించాలని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బెండె మధు అన్నారు. గురువారం మండలంలోని బెజుగామలో బిఆర్ఎస్ పార్టీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బెండె మధు మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌ను మూడవసారి ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రానికి శ్రీరామరక్ష అన్నారు. ఈ కార్యక్రమంఠ ఎంపిపి దాసరి అమరావతి, జెడ్పిటిసి పంగ మల్లేశం, ప్యాక్స్ ఛైర్మన్ వెంకటేష్ గౌడ్, రైతుబంధు సమితి మండల అధ్యక్షులు మద్ది రాజిరెడ్డి, వైస్ ఎంపిపి బెల్దె కృష్ణ గౌడ్, సమన్వయ కమిటీ సభ్యులు మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, నేతలు దయాకర్‌రెడ్డి, వెంకట్‌నర్సింహారెడ్డి, చిన్న మల్లయ్య, భాస్కర్‌రెడ్డి, ఆంజనేయులు, బొల్లారం ఎల్లయ్య, రఘుపతిరెడ్డి, తాటికొండ మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ అండాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



## గ్రామగ్రామాన బిఆర్ఎస్ పార్టీ ప్రచారం

కొండపాక, నవంబర్ 16, మనం న్యూస్: బిఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె. చంద్రశేఖర్‌రావు గెలుపు కోసం కింది స్థాయి నాయకులు, కార్యకర్తలు అహర్ని శలు కృషి చేస్తున్నారు. మూడవసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను ఎన్నుకోవాలని గ్రామాల్లో తిరుగుతూ అభ్యర్థిస్తున్నా రు. కుకునూరుపల్లి మండలంలోని లకుడారం గ్రామంలో ఎంపిటిఇసల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవిందర్, బొంపాయపల్లిలో పిఎసిఎస్ వైస్ ఛైర్మన్ అమరేందర్, సర్పంచ్ శ్రీనివాస్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కొండపాకలో ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు సాయిబాబా, పార్టీ అధ్యక్షులు నూనె కుమార్, ఎంపిటిసి ఆంజనేయులు, దుర్గయ్య ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొని ఓటు అభ్యర్థించారు. కేసీఆర్‌కు ఓటు వేయడం వల్ల ప్రజలకు జరిగే మేలు గతంలో పొందుతున్న సంక్షేమ ఫలాలను వివరించారు. మరోమారు ముఖ్యమంత్రిగా సీఎం కేసీఆర్‌ను కొనసాగించాలని, కేసీఆర్ కొనసాగితేనే ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు.



## పేదింటి వధువు వివాహానికి పుస్తెమట్టెల పంపిణీ



కొండపాక, నవంబర్ 16, మనం న్యూస్: పేదింటి వధువు వివాహ నిమిత్తం బిసి జిల్లా అధ్యక్షులు కందూరి ఐలయ్య పుస్తెమట్టెలు అందించారు. మండల పరిధిలోని లకుడారం పరిధిలోని కోలోనివంపు గ్రామానికి చెందిన తోడేటి సంధ్య వివాహానికి పుస్తెమట్టెలు అందించారు. సంధ్య తల్లిదండ్రులు గతంలో మరణించగా కుటుంబానికి అండగా నిలిచేందుకు వివాహ నిమిత్తం పుస్తెమట్టెలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్, మైపాల్, భూపాల్, అక్బర్, భూమయ్య పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**మిట్టపల్లి పిఎసిఎస్ ఛైర్మన్ చింతల శ్రీనివాస్ యాదవ్**



సిద్దిపేట అర్బన్, నవంబర్ 16, మనం న్యూస్: రైతులు ప్రభుత్వ వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని ధాన్యాన్ని అధిక ధరకు అమ్ముకోవచ్చని మిట్టపల్లి పిఎసిఎస్ ఛైర్మన్ చింతల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం సిద్దిపేట అర్బన్ మండలం ఎల్లుపల్లి గ్రామంలో ప్రభుత్వ వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము పండించిన ధాన్యాన్ని మద్ధతు ధరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని, దళారుల చేతుల్లో మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయశ్రీ రమేష్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, రైతు సమన్వయసమితి సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# దళిత బహుజన జర్నలిస్టులు ఒక్కటైతే ఎందుకంత బాధ

**మాదిగ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి మరాటి కృష్ణమూర్తి**



గజ్వేల్, నవంబర్ 16, మనం న్యూస్ః జర్నలిస్టులందరూ ఒకటే అంటున్నా గజ్వేల్ జర్నలిస్టులకు కొందరికి మాత్రమే ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఎందుకు వచ్చాయో, మిగిలిన వారికి ఎందుకు ఇప్పించ లేదని, ప్రెస్‌క్లబ్‌లో కొందరికే సభ్యత్వం ఎందుకిచ్చారో చెప్పాలని మాదిగ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి మరాటి కృష్ణమూర్తి మాదిగ అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గజ్వేల్‌లో జర్నలిస్టులంతా ఒకటే అని చెప్తున్నా మీరు అందరినీ ఒకే తాటిపైకి ఎందుకు తీసుకురాలేదో చెప్పాలని, బహుజన నాయకుడు ఈటల రాజేందర్ వస్తున్నాడన్న అక్కసుతో ఇలా మాట్లాడితే ఇన్ని రోజులు మీ పాలనే నడిచిందని, ఇప్పటికైనా మేము ఐక్యం కాకపోతే మా సమస్యలకు పరిష్కారం ఎలా లభిస్తుందని, మేమంతా ఒక్కటైతే తప్పేంటని ప్రశ్నిచారు. మా సమస్యలు చెప్పుకునే హక్కు కూడా మాకు లేదా..? ఎవరికి వారు దళిత సంఘాలు, బిసి సంఘాలు, మైనార్టీ సంఘాల పేరుతో సంఘాలు ఏర్పాటు చేసుకున్నారని, గజ్వేల్‌లో మేము సంఘం ఏర్పాటు చేస్తే తప్పేంటని ప్రశ్నించారు. విడదీసామంటున్న మీరు ఎప్పుడు కలిసి ఉన్నామో చెప్పాలని, కలిసేందుకు మీరెందుకు ఏం చేయలేదన్నారు. ఇప్పటికైనా చైతన్యమవుతున్న బహుజన జర్నలిస్టులను పార్టీల పేరుతో అవమానించవద్దని, వీలైతే చర్చకు ప్రెస్‌క్లబ్‌లో చర్చకు రావాలని, చర్చకు మేము సిద్ధంగా ఉన్నామన్నారు. రాజ్యాంగ హక్కుతో దళిత బహుజనులు జర్నలిస్టులుగా ఒక మెట్టు పైకి ఎక్కారని ప్రోత్సహించాల్సిందిపోయి హేళన చేయడం సరికాదన్నారు.

# ప్రజలను మభ్యపెడుతున్న బిఆర్ఎస్




నంగునూరు, నవంబర్ 16, మనం న్యూస్ః ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పి మరోసారి మోసం చేయాలని చూస్తున్న బిఆర్ఎస్‌ను ఓడించాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పూజల హరికృష్ణ అన్నారు. గురువారం అప్పలాయచెరువు, నర్మెట, మైసంపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి పూజల హరికృష్ణ మాట్లాడుతూ సిద్దిపేటలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని, తెరాస ప్రభుత్వం చేసిందేమీ లేదని, ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. వారి వెంట పిసిసి రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి, ఎనగందుల యాదగిరి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు రంగు అశోక్ గౌడ్, రాములుతోపాటు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# ఊపందుకున్న ఇంటింటి ప్రచారాలు

కొండపాక, నవంబర్ 16, మనం న్యూస్ః ఎన్నికల సమయం దగ్గరపడుతున్న వేళ ఆయా పార్టీలు ఇంటింటికి తిరిగి ఓటర్లను ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తూముకుంట నర్సారెడ్డి, ఆయన కూతురు అక్షరెడ్డిలు ప్రతి ఓటరు వద్దకు వెళ్లి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తూ వివిధ పార్టీల కార్యకర్తలను ఆకర్షిస్తున్నారు. లకుడారం ఉప సర్పంచ్ బాలేష్‌తోపాటు మేదినీపూర్‌లో 30 మంది టీఆర్ఎస్ కార్యకర్తలు నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. నర్సారెడ్డి కూతురు జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షురాలు అక్షరెడ్డి కుకునూరుపల్లి మండల పరిధిలోని రామచంద్రాపురంలో ఇంటింటికి





వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. మాధ్‌పల్లిలో మండల పార్టీ అధ్యక్షులు విరూపాక శ్రీనివాస్‌రెడ్డి ఇంటింటికి ప్రచారం చేశారు. కొండపాక మండలంలో బందారం గ్రామంలోని కార్యకర్తలతో కలిసి మండల పార్టీ అధ్యక్షులు లింగారావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తిమ్మారెడ్డిపల్లిలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కలిగే లబ్ధిని ప్రజలకు గుర్తు చేశారు. అదేవిధంగా గతంలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధిని కాంగ్రెస్ ద్వారా ప్రజలకు అందిన సంక్షేమ ఫలాలను నాయకులు ఓటర్లకు వివరించారు.

# ఉట్టి మాటలకు మోసపోవద్దు... గట్టి మాటలు నమ్మాలె

**-ముక్తకంఠంతో హరీష్‌రావుకు ఓటన్న రంగధాంపల్లి**

**-కాళేశ్వరం జలాలతో సస్యశ్యామలం**

**-భవిష్యత్తు బాగుండాలంటే బిఆర్ఎస్‌కే ఓటు**

సిద్దిపేట, నవంబర్ 16, మనం న్యూస్ ప్రతినిధిః ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాతే సాగునీటితో రైతులు సంబరంగా సాగు చేసుకుంటూ నేడు దేశానికే అన్నం పెట్టే స్థాయికి ఎదిగిందని రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షులు వంగ నాగిరెడ్డి, కౌన్సిలర్ వంగ రేణుక తిరుమల్‌రెడ్డిలు అన్నారు. గురువారం సిద్దిపేట మున్సిపల్ 3వ వార్డు రంగధాంపల్లిలో బిఆర్ఎస్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ బిఆర్ఎస్ ప్రకటించిన పథకాల వివరాలతో కూడిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో తాగు, సాగునీరు లేక ఎంతో మంది పొట్టచేత పట్టుకొని వలసలు వెళ్లారన్నారు. నేడు సీఎం కేసీఆర్ ఆలోచనా దృక్పథంతో ప్రతి కుటుంబం సంతోషంగా ఉందన్నారు. కేవలం ఎన్నికలప్పుడు మాత్రమే కనిపించే రాజకీయ నాయకులను గుర్తించి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతిపక్షాలకు ఓటేస్తే భవిష్యత్ అంతా చీకటి అవుతుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నో కష్టాలు పడ్డామని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. ఇక్కడ ప్రవేశపెట్టిన పథకాలన్నీ పక్క రాష్ట్రాల్లో అమలవుతున్నాయంటే అది కేసీఆర్ ఘనత అన్నారు. ఎక్కడా లేని విధంగా సిద్దిపేటను అభివృద్ధి చేసి మహానగరాలకు ధీటుగా హరీష్‌రావు మార్చారన్నారు. ఇతర రాష్ట్రాల నాయకులు సిద్దిపేటను చూసి సంతోషపడితే



ఇక్కడున్న ప్రతిపక్ష నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. హరీష్‌రావుకు ఓటేసి బంపర్ మెజార్టీని ఇద్దామని ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో వార్డు మాజీ కౌన్సిలర్ ఐలయ్య యాదవ్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ దుర్గారెడ్డి, వార్డు అధ్యక్షులు దబ్బెట శ్రీనివాస్ కనకయ్య, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గాడిచర్ల యాదగిరి, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు ఐరేని బాలమల్లు, ఈర్ల రంగం, నిమ్మ ప్రతాప్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సంజీవరెడ్డి, అంజి, శివకాంత్, ఆంజనేయులు, అంజి గౌడ్, రామకృష్ణ, మహేందర్, లింగం, ముఖేష్, హరీష్, అరవింద్, శ్రీనివాస్, దుర్గారెడ్డి, శేఖర్, లింగం, కరుణాకర్, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

## మానవ జీవన విధానంలో ప్రకృతి పాత్ర చాలా కీలకం

**ఇందిరానగర్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి**

సిద్దిపేట అర్బన్, నవంబర్ 16, మనం న్యూస్ః మానవ జీవన విధానంలో ప్రకృతి పాత్ర చాలా ఉందని ఇందిరానగర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా సాంఘికశాస్త్ర ఫోరం గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ డాక్టర్ రామచంద్రా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో





ఇందిరానగర్ ఉన్నత పాఠశాలలో జాతీయ ప్రకృతి వైద్య దినోత్సవం సందర్భంగా మానవ జీవన విధానంలోప్రకృతి పాత్ర అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో వివిధ మండలాల నుండి విద్యార్థులు పాల్గొనగా పోటీలను నిర్వహించి ప్రథమ, ద్వితీయస్థానం వచ్చిన విద్యార్థులను ఎంపిక చేసి వారికి నగదు పురస్కారం, సర్టిఫికేట్ అందించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పబ్బతి శ్రీనాకర్, , అన్నపూర్ణ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# రఘునందన్‌రావు మాటలు నమ్మి మోసపోవద్దు

**-మూడేళ్లలో నియోజకవర్గానికి చేసింది శూన్యం**

**-సీఎం కేసీఆర్ కృషితోనే కూడవెల్లి జీవనదిలా ప్రవహిస్తుంది**

**-ప్రభాకర్‌రెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గం సంపూర్ణాభివృద్ధి**

**-మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్**







మిరుదొడ్డి, నవంబర్ 16, మనం న్యూస్ః దుబ్బాక భారతీయ జనతా పార్టీ అభ్యర్థి రఘునందన్‌రావు చెప్పే మాయమాటలను నమ్మి మిరుదొడ్డి మండల ప్రజలు మోసపోవద్దని మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ అన్నారు. గురువారం మిరుదొడ్డి గ్రామంతోపాటు మండల పరిధిలోని కాసులాబాద్, లక్ష్మీనగర్, ఆరెపల్లి, ధర్మారం గ్రామాలలో దుబ్బాక బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్ధతుగా ఆయన తనయుడు పృధ్వీకృష్ణారెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామాల్లో మహిళలు మంగళహారతులతో, యువకులు డాన్సులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి రాజకీయాల్లోకి రాకముందే కొత్త ప్రభాకర్‌రెడ్డి కేపీఆర్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు. దుబ్బాక ప్రజలు అడుగడుగునా ప్రభాకర్‌రెడ్డికి జననీరాజనం పలుకుతున్నారన్నారు. బిఆర్ఎస్ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుపొందుతాడనే ఉద్దేశంతో ప్రతిపక్ష నాయకులు కుట్రలు పన్నుతూ హత్యాయత్నానికి పాల్పడడం జరిగిందన్నారు. దేవుని ఆశీస్సులతో, ప్రజల దీవెనతో ప్రాణాపాయం నుండి బయట పడ్డాడని, త్వరలో మీ ముందుకు వస్తాడన్నారు. ఇలాంటి దాడి జరిగితే సంఘీభావం ప్రకటించకున్నాసరే కానీ విమర్శలు చేయడం, దానిపై రాజకీయాలు చేయడం చాలా బాధాకరమన్నారు. మాయమాటలు చెప్పి దుబ్బాక ఉప ఎన్నికల్లో గెలిచిన రఘునందన్‌రావు ఆయన ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా పూర్తి చేయలేదన్నారు. దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి బిఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. పని చేసే వారికి పట్టం కడితే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. రైతుల సంక్షేమం కోసం దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. నేడు నియోజకవర్గ రైతులకు కూడవెల్లి వాగు జీవనదిలా ప్రవహిస్తుందంటే అందులో సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావుపాత్ర ఎంతో కీలకంగా ఉందన్నారు. కావున నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బిఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మిరుదొడ్డి మండలం లక్ష్మీనగరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వడ్డెపల్లి కిషన్‌రావు, అగురం శ్రీనివాస్‌రెడ్డిలు బిఆర్ఎస్‌లో చేరగా పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, తెరాస నాయకులు, కార్యకర్తలు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**-బిఆర్ఎస్ బీజేపిల మధ్య వాగ్వాదం**

మండల పరిధిలోని కాసులాబాద్ గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా బిఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహిస్తుంటే బీఆర్ఎస్, బీజేపి కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో పోలీసులు వెంటనే జోక్యం చేసుకొని ఇరు వర్గాలను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఇరుపార్టీల నాయకులు ఒకరినొకరు తోసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.



## ఏకగ్రీవ తీర్మానాలు బోగస్

**-ఆరు గ్యారంటీలే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయి**

**-కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు**



సిద్దిపేట రూరల్, నవంబర్ 16, మనం న్యూస్ః ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగనున్న సమయంలో ఏకగ్రీవాల పేరు చెప్పి హరీష్‌రావు అనుచరులు బెదిరిస్తున్నారని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు అన్నారు. నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల రాజ్‌వీర్‌తో కలిసి మాట్లాడుతూ గ్రామాల్లో కులసంఘాలకు చెందిన కొంతమంది హరీష్‌రావు అనుచరులు కలిసి బోగస్ ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నారన్నారు. దీన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు, దాడులు చేస్తామని బెదిరిస్తున్నారన్నారు. గ్రామాలలో హరీష్‌రావుపై ఉన్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికి ఈ ఏకగ్రీవ తీర్మాన డ్రామాలని ఎద్దేవా చేశారు. రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే అని, ఆరు గ్యారంటీ పథకాలే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయన్నారు. నిజంగా అభివృద్ధి జరిగి ఉంటే ఏకగ్రీవ తీర్మానాలని ప్రజలను మభ్య పెట్టడం దేనికన్నారు. ప్రతి గ్రామంలో అర్హులందరికీ లబ్ధి చెంది ఉంటే ప్రచారాలు ఎందుకని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో చిన్నకోడూరు మండల అధ్యక్షులు మీసం మహేందర్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి పవన్, ఎస్సీ సెల్ మాజీ మండల అధ్యక్షులు రమేష్, గ్రామాధ్యక్షుడు జక్కుల కనకయ్య, బిసి సెల్ నాయకులు భాస్కర్, అశోక్ కిసాన్ సెల్ నాయకులు కనకయ్య, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.



**బిఆర్ఎస్ గెలుపు భయంతోనే**

## బీజేపి చిల్లర చేష్టలు

**సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు**

**తుమ్మల బాల్‌రాజు**

మిరుదొడ్డి, నవంబర్ 16, మనం న్యూస్ః బిఆర్ఎస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుస్తుందన్న భయంతోనే బీజేపి నాయకులు చిల్లర చేష్టలకు పాల్పడుతుందని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు తుమ్మల బాల్‌రాజు అన్నారు. గురువారం మిరుదొడ్డి మండల కేంద్రంలో కాసులాబాద్ బిఆర్ఎస్ నాయకులతో కలిసి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాసులాబాద్ గ్రామంలో కొంత మంది బీజేపి నాయకులు కావాలనే బిఆర్ఎస్ పార్టీ ప్రచారంలో వాగ్వాదానికి దిగడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. బిఆర్ఎస్ చేస్తున్న ప్రచార కార్యక్రమాల్లో బీజేపి నాయకులు గొడవలు చేసి లబ్ధి పొందాలనుకోవడం సరికాదన్నారు. ఈ సమావేశంలో కాసులాబాద్ గ్రామ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## చిన్నతనం నుండే క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలి

**లింగం సుధాకర్‌రెడ్డి**



సిద్దిపేట అర్బన్, నవంబర్ 16, మనం న్యూస్ః విద్యార్థులకు చిన్నతనం నుండే మంచి నడవడికతో కూడిన విద్యను అందించాలని సరస్వతి శిశుమందిర్ లింగం సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం తడకపల్లిలోని విద్యారణ్య ఆవాస విద్యాలయంలో నూతనంగా నిర్మించిన బాలికల వసతి గృహాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్పోరేట్ స్థాయికి ధీటుగా సరస్వతి విద్యాపీఠం పాఠశాలలను తయారు చేస్తున్నామన్నారు. శిశుమందిరాలు వ్యాపారం కోస కాదని, సమాజ పోషితమన్నారు. ఈ కార్యక్రమంలో తడకమడ్ల ఈశ్వరయ్య కొమురవెల్లి శివకుమార్, లయన్ సూర్య, అమర్‌నాథ్, ప్రాంత కార్యదర్శి సీతారాములు, కాటం రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక లోకానికి అండగా బిఆర్ఎస్

### -మహిపాల్‌రెడ్డికి మద్దతుగా కార్మిక సంఘాలు
### -ఈనెల 23న పటాన్‌చెరుకు సీఎం కేసీఆర్
### -బిఆర్ఎస్ అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, నవంబర్ 16, మనం న్యూస్ః బిఆర్ఎస్ ప్రభుత్వం నిరంతరం కార్మికులకు అండగా నిలిచిందన్నారు. ఎక్కడి నుండో వచ్చిన వారిని సైతం జాగ్రత్తగా కాపాడుకుంటూ వారికి ఉపాధి కల్పించిందన్నారు. గురువారం జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు ఆయనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడగా పేరొందిన పటాన్‌చెరు నియోజకవర్గంలో 2 లక్షలకు పైగా కార్మికులు పని చేస్తున్నారని, వారి అభ్యున్నతికి సంక్షేమానికి ఎల్లప్పుడూ తాము అండగా ఉంటామన్నారు. బిహెచ్ఇఎల్, బిడిఎల్, ఓడిఎఫ్ వంటి వాటిని బీజేపి ప్రభుత్వం వర్క్ ఆర్డర్లు ఇవ్వకుండా నిర్వీర్యం చేయడంతో పాటు వాటికి సంబంధించిన ఆస్తులు





ప్రైవేటుపరం చేస్తుందన్నారు. 60 ఏళ్ల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ పరిశ్రమలకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయకపోవడంతో లక్షల సంఖ్యలో కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. నేడు సీఎం కేసీఆర్ నాయకత్వంలో నూతన పారిశ్రామిక విధనంతో నిరంతరం కరెంటు సరఫరా జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 23వ తేదీన పటాన్‌చెరుకు సీఎం కేసీఆర్ రానున్నారని, అందరూ హాజరై ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం బిహెచ్ఇఎల్, ఐఎన్టీయుసి, హెచ్ఎంఎస్‌తోపాటు పలు పలువురు నాయకులు ఎమ్మెల్యేకు ఏకగ్రీవ మద్ధతు ప్రకటించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, బిఆర్‌టియు రాష్ట్ర అద్యక్షులు రాంబాబు యాదవ్, కనీస వేతనాల సలహా మండలి మాజీ ఛైర్మన్ రామ్మోహన్‌రావు, టివి రావు, నర్రా బిక్షపతి, వర ప్రసాద్‌రెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.

## నా చివరి శ్వాస వరకు ప్రజాసేవ చేస్తా

### -చింతా ప్రభాకర్



సదాశివపేట, నవంబర్ 16, మనం న్యూస్ః సంగారెడ్డి నియోజకవర్గ ప్రజల కోసం, అభివృద్ధి కోసం మీ సేకుడిగా చివరి శ్వాస వరకు పని చేస్తానని బిఆర్ఎస్ అభ్యర్థి చింత ప్రభాకర్ అన్నారు. బుధవారం రాత్రి సదాశివపేటలోని 16, 17, 18, 19 వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆమట్లాడుతూ తన ప్రాణం ఉన్నంత వరకు ప్రజా సేవ చేస్తూను ఉంటానన్నారు. మాయమాటలు చెప్పి తప్పించుకోవడం తనకు అలవాటు లేదని, చేసేదే చెప్తానన్నారు. ఇచ్చిన హామీలు తప్పక నెరవేరుస్తానన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో పల్లెలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రజలు ఆలోచించి సరైన అభ్యర్థిని ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ముఖీమ్, పట్టణ అధ్యక్షులు చీల మల్లన్న, కౌన్సిలర్లు ఇలియాజ్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## హిందూ సమాజానికి రేవంత్ క్షమాపణ చెప్పాలి



సిద్దిపేట రూరల్, నవంబర్ 16, మనం న్యూస్ః టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి హిందూ దేవాలయ భూములను వేలం వేసి వచ్చిన డబ్బులతో ముస్లింలను ఆదుకుంటామని అనడాన్ని ఖండిస్తున్నట్లు హిందూధర్మ రక్షణ సేవా సమితి అధ్యక్షులు దోనె అశోక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందువుల పట్ల చులకనగా మాట్లాడితే హిందూ సమాజం ఊరుకోదన్నారు. ముస్లింలపై ప్రేమ ఉంటే వారిని ఆదుకోవాలే తప్ప మత కల్లోలాలు రేపొద్దన్నారు.

## ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులకు బీజేపి నుండి సస్పెన్షన్

సిద్ధిపేట, నవంబర్ 16, మనం న్యూస్ ప్రతినిధిః బీజేపి పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తూ స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిచిన ముగ్గురు అభ్యర్థులను పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు బీజేపి జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు ఆయన గురువారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. సిద్దిపేట అసెంబ్లీ స్థానానికి స్వతంత్రులుగా పోటీ చేసిన పిల్లి సాయికుమార్, గుమ్మడి శ్రీశైలం, గజ్వే నుండి పోటీ చేసిన దాసరి భానుచందర్‌లను పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బీజేపి క్రమశిక్షణ గల పార్టీ అని, పార్టీ తీసుకునే చర్యలకు ఎవరూ అతీతులు కారని పేర్కొన్రాను. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు విరుద్ధంగా వ్యవహరించినా వారిపై వేటు తప్పదని శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు.

## జర్నలిస్టులకు సన్మానం



పాపన్నపేట, నవంబర్ 16, మనం న్యూస్ః జర్నలిస్టుల జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా కొత్తపల్లి గ్రామ సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు కుమ్మరి జగన్నాథం గురువారం పాపన్నపేట మండల జర్నలిస్టులకు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తూ ప్రజలకు అందిస్తూ సమాజ శ్రేయస్సుకు పాటుపడుతున్న వారు జర్నలిస్టులు అన్నారు. వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ప్రెస్‌క్లబ్ మాజీ ప్రధాన కార్యదర్శి అంతు నర్సింలు, మిన్పూర్ శ్రీనివాస్, కళ్లేటి సంగమేశ్వర్, వంజర బాలకిషన్, శివచరణ్‌సింగ్, సుమన్, అంతు శ్రీనివాస్, శ్యామ్ సుందర్, బి. ప్రసాద్, చెల్మటి మల్లేశం, డి. శ్రీనివాస్, సాయి వికాస్ తదితరులు పాల్గొన్నారు.

# సబ్బండ వర్గాల పార్టీ బీజేపి

## బీజేపి మెదక్ అభ్యర్థి పంజా విజయ్‌కుమార్



పాపన్నపేట, నవంబర్ 16, మనం న్యూస్ః బీజేపి సబ్బండ వర్గాల పార్టీ అని, కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు అగ్రవర్ణాల పార్టీలని మెదక్ బీజేపి అభ్యర్థి పంజా విజయ్‌కుమార్ అన్నారు. గురువారం పాపన్నపేట మండలంలోని సీతానగరం, నార్సింగి, బాచారం, చిత్రియాల్, గాజుల గూడెం, కొడపాక, నాగ్సానిపల్లి, శేరిపల్లి, అబ్లాపూర్, అన్నారం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు . ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కమలం పువ్వు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు అగ్రవర్ణాల పార్టీలని, కేవలం బీజేపి మాత్రమే బహుజనుల పార్టీ, సబ్బండ వర్గాల పార్టీ అన్నారు. అధికారంలోకి వస్తే బహుజనులకు సీఎం పదవి స్తానని ప్రకటించిన పార్టీ బీజేపి అని, ఇతర పార్టీలకు ఆ దమ్ము లేదన్నారు. మెదక్ నియోజకవర్గాన్ని పద్మారెడ్డి సర్వనాశనం చేసిందని, అన్ని కార్యాలయాలు సిద్దిపేటకు తరలించిన ఎమ్మెల్యే పేద ప్రజలు అప్పుల బాధతో విషం తాగినా, రైతులకు పాముకాటు వేసినా హైదరాబాద్ వెళ్లే దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందని, హైదరాబాద్ వెళ్లే క్రమంలో నర్సాపూర్ అడవుల్లోనే ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రతి పథకంలో కేంద్ర ప్రభుత్వ నిధులున్నాయని, ప్రధానిమంత్రి ఆవాస్ యోజన కింద ఇల్లు కట్టుకోవడానికి రూ.3 లక్షలు ఇస్తే దానికి రాష్ట్రం మరో లక్ష కలిపడానికి బిఆర్ఎస్ ఎందుకు వెనుకాడుతుందన్నారు. 40 గ్రామాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కట్టి 36 గ్రామాల్లో నిరుపేదలను గుడిసెల్లో ఉంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కావున ప్రజలు ఈసారి కమలం పువ్వు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు. ఆయన వెంట బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం పరినీత, నందు జనార్ధన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బైండ్ల సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షులు వడ్ల సంతోష్‌చారి, బీజేవైజం జిల్లా ఉపాధ్యక్షులు నరేష్ కుమార్, ఎస్టీ మోర్చ అధ్యక్షులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు



కొండాపూర్, నవంబర్ 16, మనం న్యూస్ః మండల పరిధిలోని కొండాపూర్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి జగ్గారెడ్డి సమక్షంలో పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. పార్టీలో చేరిన వారిని జగ్గారెడ్డికాంగ్రెస్ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు భద్రత కల్పిస్తామని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు వై. ప్రభు, ఎంపిటిసి నర్సింహారెడ్డి, సొసైటీ ఛైర్మన్ బాలికరెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

## సిపియం నేతలతో మంత్రి హరీష్‌రావు సమావేశం



సంగారెడ్డి, నవంబర్ 16, మనం న్యూస్ః సంగారెడ్డి పట్టణంలోని సిపియం పార్టీ కార్యాలయంలో సిపియం ముఖ్య నాయకులతో మంత్రి హరీష్‌రావు గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సిపియం పార్టీ పోటీ చేయని స్థానాల్లో బిఆర్ఎస్ అభ్యర్థులకు మద్ధతు తెలపాలని కోరారు. వారు సానుకూలంగా స్పందించి పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చుక్కా రాములు తెలిపారు. ఈసమావేశంలో బిఆర్ఎస్ అభ్యర్థి చింత ప్రభాకర్, సిపియం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్, మల్లేశం, మాణిక్యం తదితరులు ఉన్నారు.

## గ్రామాల్లో జోరుగా సాగుతున్న జగ్గారెడ్డి ప్రచారం



సదాశివపేట, నవంబర్ 16, మనం న్యూస్ః సదాశివపేట మండలంలోని ఆరూరు, మిలిగిరిపేట్, కోనాపూర్ సూరారం, మద్దికుంట, తంగడపల్లి తదితర గ్రామాల్లో గురువారం కాంగ్రెస్ అభ్యర్థి తూర్పు జయప్రకాశ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం జోరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ చేపట్టిన ఆరు పథకాలు పేద, బడుగు బలహీన వర్గాల కోసమే అన్నారు. రైతులకు ఒకేసారి రుణమాఫీ చేస్తుందని, పేద వారికి ఇందిరమ్మ గృహాలు కట్టిస్తామన్నారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని, తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. ఆరూర్ సర్పంచ్ నాయికోటి మధు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రామ్‌రెడ్డి, మండల అధ్యక్షులు సిద్ధన్న, నాయకులు, కార్యకర్తలు తదితరుఉ పాల్గొన్నారు.

# నేను గెలిస్తే మీరు గెలిచినట్లే

## -ఇల్లు లేని వారికి విడతల వారీగా ఇండ్ల నిర్మాణం
## -బిఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి నీలం మధు ముదిరాజ్

రామచంద్రాపురం, నవంబర్ 16, మనం న్యూస్ః ప్రజలే నా వసుదైక కుటుంబమని, ఎమ్మెల్యేగా నేను గెలిస్తే నా కుటుంబ సభ్యులుగా మీరంతా గెలిచినట్టే అని బిఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ పిలుపునిచ్చారు. రామచంద్రాపురం, భారతినగర్ డివిజన్‌లలో శ్రీనివాస్‌నగర్ కాలనీ, పాత ఆర్‌సిపురం, కాశిరెడ్డిపల్లి కాలనీ,తోపాటు పలు కాలనీల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకొని మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తనను గెలిపిస్తే అభివృద్ధి, ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తానన్నారు. బహుజనుల ఆత్మగౌరవాన్ని కాపాడాలనే ఏకైక లక్ష్యంతో ముందుకు సాగుతున్నానన్నారు.





మన ఆత్మగౌరవాన్ని నోట్ల కట్టలతో కొట్టాలని చూస్తున్నారని, అయితే నోట్లతో బహుజనుల ఆత్మగౌరవం కొనడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. మనం ఎదిగితే మన ప్రాంతాల్ని మనమే అన్ని రంగాల్లో ధీటుగా అభివృద్ధి చేసుకోవచ్చని పిలుపునిచ్చారు. మన అభివృద్ధి కోసం ఒక్కసారి నాకు ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు. రామచంద్రాపురంలో ఇండ్లు లేని వారికి పక్కా ఇండ్లు నిర్మిస్తానని, కాలనీల్లోని సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఐటిఐ కళాశాలకు పూర్వ వైభవం తీసుకువస్తానని ప్రకటించారు. తన వెంట నడుస్తున్న సబ్బండ వర్గాల ప్రజలందరికీ రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.



## బహుజన ముక్తి పార్టీ భారీ ర్యాలీ
## సంగారెడ్డి బిఎంపి అభ్యర్థి పల్పనూరి శేఖర్



సంగారెడ్డి, నవంబర్ 16, మనం న్యూస్ః దొంగ నాయకులను గద్దె దింపడమే తమ లక్ష్యమని సంగారెడ్డి బిఎంపి పార్టీ అభ్యర్థి పల్పనూరి శేఖర్ అన్నారు. గురువారం సంగారెడ్డిలో భారీ బహిరంగ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీఓ బహుజన ముక్తి పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు దాస్‌రామ్ నాయక్, నేషనల్ జనరల్ సెక్రటరీ మొహమ్మద్ ఫైముద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్పనూరి శేఖర్ మాట్లాడుతూ సమాజానికి తాను చేసిన సేవలను గుర్తించి తనకు టికెట్ ఇచ్చినందుకు పార్టీ నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే గతంలో పాలించిన నాయకులు పూర్తిగా ప్రజలను విస్మరించారని, ప్రజా సమస్యలు పట్టించుకోకుండా గాలికి వదిలేశారన్నారు.వారు ప్రజలకు అందుబాటులో లేకుండా ప్రజా సమస్యల్ని పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. నియోజకవర్గ ప్రజల అమూల్యమైన ఓటు బిఎంపి పార్టీ మంచం గుర్తుకు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముసిల నాయకులు సుమన్, రెహాన్, అబ్దుల్ ఖాదర్, నరేష్, ప్రవీన్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉండని జగ్గారెడ్డిని ఓడించాలి
## -బిఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్



సంగారెడ్డి, నవంబర్ 16, మనం న్యూస్ః ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ప్రజలకు అందుబాటులో లేని జగ్గారెడ్డిని ఓడిద్దామని బిఆర్ఎస్ అభ్యర్థి చింత ప్రభాకర్ అన్నారు. కంది, చిమ్నాపూర్ గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళహారతులు, గజమాలతో, డిజే పాటలతో చింతా ప్రభాకర్‌కు స్వాగతం పలికారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ నిత్యం ప్రజల మధ్య ఉండే నాయకున్ని ఎన్నుకోవాలని ప్రజలకు సూచించారు. కరోనా సమయంలో చింత ప్రభాకర్ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజల మధ్యన ఉన్నారని గుర్తు చేశారు. అనంతరం చింత ప్రభాకర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వచ్చే నాయకుడు కాదు, నిరంతరం అందుబాటులో ఉండే తనను కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపిస్తే ఐదేళ్లు మీసేవలో ఉంటానన్నారు.



## రాజేశ్వర్‌రావు దేశ్‌పాండేను కలిసిన మంత్రి హరీష్‌రావు



సంగారెడ్డి, నవంబర్ 16, మనం న్యూస్ః బీజేపి పార్టీకి రాజీనామా చేసిన రాజేశ్వర్‌రావు దేశ్‌పాండేను మంత్రి హరీష్‌ఱావు గురువారం కలిసారు. కొండాపూర్ మండలం మల్లేపల్లి గ్రామంలోని వారి నివాసంలో మంత్రి రాజేశ్వర్‌రావు దేశ్‌పాండేతో భేటీ అయ్యారు. దేశ్‌పాండే అనుచరులు బిఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి గులాబీ కండువాలు కప్పి బిఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు.

## కారెక్కిన కాంగ్రెస్, బీజేపి కార్యకర్తలు



కొండాపూర్, నవంబర్ 16, మనం న్యూస్ః కొండాపూర్ మండలంలో మల్లేపల్లి గ్రామంలో గురువారం కాంగ్రెస్, బీజేపి పార్టీల నుండి యువకులు పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి సంగారెడ్డి బిఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ప్రతి కార్యకర్త ఎన్నికల్లో కష్టపడి విజయం సాధించడానికి కృషి చేయాలని కోరారు. ప్రతి ఒక్కరు కారు గుర్తుకు ఓటేసేలా ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. ఎన్నికల్లో కొంతమంది మాయమాటలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని, వాటిని పట్టించుకోకుండా పార్టీ కోసం పని చేయాలన్నారు. ఈకార్యక్రమంలో జెడ్పిటిసి పద్మావతి, పాండురంగం, మండల పార్టీ అధ్యక్షులు విఠల్, రుక్మొద్దీన్, జగదీష్, నర్సింహారెడ్డి, రాందాస్, రామప్ప తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గాలకు మైక్రో అబ్జర్వర్ల కేటాయింపు పూర్తి
## అదనపు కలెక్టర్ మాధురి



సంగారెడ్డి, నవంబర్ 16, మనం న్యూస్ః అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం ఎన్నికల పరిశీలకుల సమక్షంలో జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు అవసరమైన మైక్రో అబ్జర్వర్లను ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కేటాయించినట్లు జిల్లా ఎన్నికల అదనపు అధికారి మాధురి తెలిపారు. ర్యాండమైజేషన్ ప్రక్రియ మొత్తాన్ని ఎన్నికల జనరల్ అబ్జర్వర్లు, వ్యయ పరిశీకుల సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు దీపక్ సింగ్లా, పవన్‌కుమార్, వ్యయ పరిశీలకులు నాజీమ్ జై ఖాన్, డిఈఓ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్ధతుగా ప్రచారం
## బ్రహ్మరథం పడుతున్న ప్రజలు



దౌల్తాబాద్, నవంబర్ 16, మనం న్యూస్ః బిఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్ధతుగా దౌల్తాబాద్ మండల నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. పార్టీకి కార్యకర్తలే బలమని సర్పంచ్ దార సత్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని శౌరీపూర్ గ్రామంలో బిఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డికి మద్ధతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్డాతూ దుబ్బాకలో బిఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కర్యకర్తలు కష్టపడి పని చేస్తే నియోజకవర్గం అభివృద్ధిలో ముందుంటుందన్నారు. ఈ కార్యకమంలో ఉప సర్పంచ్ శివరెడ్డి, వార్డు మెంబర్ లక్ష్మన్, గ్రామాధ్యక్షులు శివంది భాస్కర్, బిఆర్ఎస్వి అధ్యక్షులు కొడ గణేష్, పార్టీ సభ్యులు తుమ్మ అలకజందర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బిఆర్ఎస్ యూత్ లీడర్ సయ్యద్ ఖలీలుద్దీన్ ఆధ్వర్యంలో దౌల్తాబాద్‌లో ప్రభాకర్‌రెడ్డికి మద్ధతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బిఆర్ఎస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి ఫలాలను ప్రతి ఇంటికి వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఆయన వెంట మహమ్మద్ ఖలీల్, మహమ్మద్ ఆరిఫ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.







# ప్రచారంలో గులాబీ జోరు

మొదటి పేజీ తరువాయి..

## ఏకగ్రీవ తీర్మాన పత్రాలు అందజేత

పట్టణంలోని 6వ వార్డు గంగపుత్ర సంఘంలో గంపగుత్తగా తమ ఓట్లన్నీ బిఆర్ఎస్ అభ్యర్థి హరీష్‌రావుకే అంటూ తీర్మానం చేసిన పత్రాన్ని పార్టీ పట్టణ అద్యక్షులు కొండం సంపత్‌రెడ్డి చేతుల మీదుగా మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజనర్సుకు అందజేశారు. ప్రతి పల్లెను పచ్చగా మార్చింది కేసీఆరే, సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావుల కృషితోనే సిద్దిపేట ప్రాంతం సస్యశ్యామలం అయిందని సుడా ఛైర్మన్ మారెడ్డి రవిందర్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట రూరల్ మండలం రాంపూర్, తోర్నాల గ్రామాలలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆత్మగౌరవంగా జీవించాలని గృహలక్ష్మి పథకం కింద రాంపూర్ గ్రామానికి 25 ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ హయాంలో కరెంటు కష్టాలతో ఎరువుల కొరతతో ఎన్నో ఇబ్బందులు పడ్డామన్నారు. బిఆర్ఎస్ పాలనలో 24 గంటల ఉచిత కరెంటుతోపాటు పెటుబ్డబడి సాయం కింద రూ. 10 వేలు ఇచ్చి రైతును రాజును చేసింది కేసీఆర్ ప్రభుత్వమే అన్నారు. రైతు బీమాతో కుటుంబానికి పెద్దబిడ్డగా నిలిచాడన్నారు. ప్రతి పదవాడికి ఆసరా పింఛన్‌తో బిఆర్ఎస్ సాయం అందించిందన్నారు. బిఆర్ ఎస్ ప్రభుత్వంతో ప్రతి పల్లె సస్యశ్యామలం అయిందని, నాడు వలసలకు వెళ్లే రోజు నుండి నేడు ఇక్కడికే వలసలు వచ్చే రోజులు వచ్చాయన్నారు. భవిష్యత్తు బాగుండాలన్నా బిఆర్ఎస్‌కే ఓటేయాలన్నారు. ఎవరెన్ని జిమ్మిక్కులు చేసినా మోసపోవద్దని, హరీష్‌రావుకు బంపర్ మెజార్టీని ఇద్దామన్నారు. అదేవిధంగా సీతారాంనగర్ కోటిలింగాల ప్రాంతంలో హరీష్‌రావుకు మద్ధతుగా బచ్చు రమేష్, రమేష్ కరాటే కృష్ణ నందాదేవి, నరసింహ, మహిళలు, కార్యకర్తలు మూడవసారి హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ నిలవాలని, హరీష్‌రావుకు లక్ష యాభై వేల మెజార్టీ రావాలని ప్రత్యేక పూజలు చేశారు.

**-నంగునూరులో...** సిద్దిపేట బిఆర్ఎస్ అభ్యర్థి హరీస్‌రావుకు లక్ష యాభై వేల మెజార్టీతో గెలిపిస్తామని మాజీ ఎంపిపి జాప శ్రీకాంత్‌రెడ్డి, ఆయిల్ ఫామ్ రైతు వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎడ్ల సోమిరెడ్డి, జెడ్పిటిసి తడిసిన ఉమ, ఏఎంసి ఛైర్మన్ రాగుల సరాయ్య, తెరాస మండల పార్టీ అధ్యక్షులు అనగోని లింగం గౌడ్‌లు అన్నారు. గురువారం మండల పరిధిలోని రాంపూర్, మగ్దుంపూర్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంట్లో హరీష్‌రావుకు మద్ధతుగా బ్రహ్మరథం పడుతున్నారని, తమ మద్ధతు పూర్తిగా హరీష్‌రావుకే ప్రకటిస్తున్నట్లు తెలిపారన్నారు. ఈసారి ఎన్నికల్లో లక్ష యాభై వేల మెజార్టీతో హరీష్‌రావు గెలుపొందడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దువ్వల మల్లయ్య, వేముల వెంకట్‌రెడ్డి, పిఎసిఎస్ ఛైర్మన్‌లు కోల రమేష్ గౌడ్, మైపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డితోపాటు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.






